# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగాపై అవగాహన కల్పించే దిశగా కార్యక్రమాలు నిర్వహించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ గ్రామ పంచాయతీ పెద్దలను కోరారు.**

2. **రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా కె.పవన్‌కల్యాణ్, రాష్ట్ర హోంమంత్రిగా వి.అనిత ఈరోజు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.**

3. **రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.**

4. **ఈరోజు 'ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం" పాటిస్తున్నారు.**

5. **రానున్న రెండు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి ఒక మోస్తారు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.**

==========================

గ్రామాల్లో ప్రజలకు.. సంపూర్ణమైన ఆరోగ్యం కోసం యోగా, చిరుధాన్యాల గురించి అవగాహన కల్పించే దిశగా కార్యక్రమాలు నిర్వహించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ గ్రామ పంచాయతీ పెద్దలను కోరారు. గ్రామ పంచాయతీ ప్రాంగాణాలో పాఠశాలల్లో, అంగన్ వాడీలలో, ఆరోగ్య కేంద్రాల్లో, తదితర స్థలాలలో యోగా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజలలో ముఖ్యంగా యువతలో, ఉత్సాహం కలిగించి, ఒత్తిడి లేని జీవితానికి సహాయపడుతుందని గ్రామ ప్రధాన్‌కు రాసిన లేఖలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ పంచాయతీ నివాసితులకు అభినందనలు తెలియజేస్తూ... యోగా వలన ప్రజా జీవితంలో సానుకూల ప్రభావం ఉంటుందని ఉద్ఘాటించారు. ఆరోగ్యకరమైన దేశాన్ని నిర్మించేందుకు " యోగ ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటి' అనే ఈ ఏడాది ఇతివృత్తం ప్రభుత్వ కృషికి మరింత చేయూతనిస్తుందని లేఖలో పేర్కొన్నారు.

-------------------------

రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా జనసేన అధ్యక్షులు కె.పవన్‌కల్యాణ్ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఉపముఖ్యమంత్రి పదవితో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రిగా

పవన్‌కల్యాణ్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పలు దస్త్రాలపై ఆయన సంతకాలు చేశారు. అనంతరం పలువురు మంత్రులు, వివిధ శాఖల అధికారులు, శాసనసభ సభ్యులు అభినందనలు తెలిపారు. మరోవైపు రాష్ట్ర హోంమంత్రిగా వి.అనిత ఈరోజు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. వెలగపూడి సచివాలయంలోని బ్లాక్–2లో దస్త్రాలపై సంతకాలు చేసి బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం పోలీసు అధికారులు, వివిధ శాఖల అధికారులు ఆమెకు అభినందనలు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించి పూర్వ వైభవానికి కృషి చేస్తానని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నిన్న నెల్లూరు నగరం సంతపేటలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో శతాబ్దాల చరిత్ర ఉన్న ఎన్నో ఆలయాలున్నాయన్నారు. వీటి అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రితో మాట్లాడి చర్యలు చేపడతామన్నారు. ప్రధాన ఆలయాలను మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరముందని దేవాదాయశాఖలో ప్రక్షాళన చేపట్టి సమూల మార్పులకు శ్రీకారం చుడతామని తెలిపారు.

---------------------------

ఐక్యరాజ్య సమితి సూచనతో ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపుమేరకు ప్రపంచ దేశాలు ఈరోజు 'ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం" పాటిస్తున్నాయి. మానవ శరీరంలోని ఎర్ర రక్త కణాలను క్షీణింపచేసే అతి ప్రమాదకరమైన వ్యాధినే సికిల్‌సెల్ అంటారు. ఈ వ్యాధికి గురైన వారి ఎర్రరక్తకణాలు... నెల వంక ఆకారంలోకి మారతాయి. ఫలితంగా అవయవాలకు తగినంత రక్త ప్రసారం జరగదు. ఈ వ్యాధికి గురైన వారి శరీర మార్పులను గమనిస్తూ..... తగిన చికిత్స పొందితే సికిల్ సెల్ వ్యాధిని అధిగమించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ సికిల్ సెల్ ఎనిమియా మిషన్ వ్యాధి పట్ల అవహగానా కల్పిస్తోంది.

**.....వాయిస్.... 1:05 సెకన్లు....**

---------------------------

గ్రామ, వార్డు సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలకు సంబంధించిన చిహ్నాలు, ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించింది. పాస్ పుస్తకాలు, ధ్రువీకరణ పత్రాల్లో ఎటువంటి ఫొటోలు, రంగులు, రాజకీయ పార్టీ జెండాలు ఉండేందుకు వీల్లేదని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. పార్టీ రంగులు, జెండాలతో ఉండే ప్రభుత్వ అధికారిక వెబ్ సైట్లు, పాస్ పుస్తకాలు, లబ్ధిదారుల పుస్తకాలు, ధ్రువీకరణ పత్రాలను నిలిపివేయాల్సిందిగా ఆదేశాలిచ్చింది. ఈ పత్రాలు జారీ చేయాల్సిన నమూనాలను కూడా జతపరుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

---------------------------

యోగ సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం చేస్తుందని యోగా శిక్షకులు, అభ్యాసకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ యోగాను తప్పనిసరిగా అభ్యసించాలని తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో యోగా గురువు ఏ.సుజాత పేర్కొన్నారు. యోగాపై కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలతోనే

ఎంతోమంది విద్యార్థులు యోగాను అభ్యసిస్తున్నారని చెప్పారు. ప్రతిరోజు ఒక గంట యోగా చేయడం వల్ల అనారోగ్య సమస్యలు దూరమవుతాయని తెలుపుతూ....

**....వాయిస్....27 సెకన్లు...**

---------------------------

17వ విడత కిసాన్ సమ్మాన్ నిధులను వారణాసి వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిన్న విడుదల చేయగా.. ఆ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని పలు జిల్లాల్లో దృశ్య మాధ్యమ విధానంలో నిర్వహించారు. ఇందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి పిఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఒక లక్షా 13 వేల 865 మంది రైతులకు 22.77 కోట్ల రూపాయలను బ్యాంకు ఖాతాల్లో జమ చేశారని మంత్రి తెలిపారు. రైతుల ఆర్థిక స్వావలంబనకు పిఎం కిసాన్ నిధులు దోహదపడతాయని అన్నారు. గుంటూరు జిల్లాలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, వ్యవసాయశాఖ కమిషనర్ సి. హెచ్ హరికిరణ్ పాల్గొన్నారు. అనంతపురం జిల్లా కృషి విజ్ఞాన్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అనంతపురం పార్లమెంటు సభ్యులు ఎ.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో 40.91 లక్షల మంది రైతులకు 824.6 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద తమ ఖాతాల్లో నగదు జమ అయిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించిన పిఎం కిసాన్ నగదు తమ వ్యవసాయ పనులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలానికి చెందిన ఇలగనూరు రైతు వి.చంద్ర ఆకాశవాణికి తెలుపుతూ...

**.....వాయిస్... 15 సెకన్లు....**

---------------------------

సికిల్ సెల్ వ్యాధిని నిర్మూలించే లక్ష్యంతో ప్రతి ఒక్కరు పనిచేయాలని ప్రకాశం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ అన్నారు. ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినోత్సవం పురస్కరించుకొని ఈరోజు ఒంగోలులో సికిల్ సెల్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సికిల్ సెల్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని గిరిజన ప్రాంత ఆదివాసులకు సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించామని, వారికి అవసరమైన చికిత్సను అందించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ...

**......వాయిస్ 22 సెకన్లు.....**

=====================